

## పొగ పీల్చటంతో శ్వాసకోశంలో కేన్సరు రావచ్చు

★ గుండెజబ్బులు
★ నోటికురుపు
★ నోటిలో కేన్సర్

ఇతర జబ్బులూ రావచ్చు

ఇవి వైద్యరీత్యా యధార్థాలు

పొగపీల్చటం వలన ఆరోగ్యం అనేక విధాల దెబ్బతింటుంది.

తీరని జబ్బులు, శ్వాసకోశంలోను, శరీరం ఇతర భాగాల్లోను కేన్సరు రావచ్చు....

* సుదీర్ఘమయిన రొమ్ముపడిసెము, ఇతర శ్వాసకోశవ్యాధులు, గుండెజబ్బు ఇతర రక్తప్రసరణ జబ్బులు మొ॥ ఎన్నడూ పొగపీల్చనివారిలో చాల తక్కువ. సిగరెట్ పీల్చేవారిలో ఈజబ్బులు ఎక్కువ.
* పొగపీల్చేవారి జీవితం పొగపీల్చని వారికన్న త్వరలో ముగిసిపోవచ్చు. అంటే నలభై నుండి యాభై ఏండ్లు దాటేవరకు.
* చిన్నప్పుడే పొగపీల్చటం ప్రారంభించినవారిలో మరణాలరేటు ఎక్కువ.
* పుట్టబోయే శిశువుకు కూడా ప్రమాదం కలుగుతుంది.

పొగత్రాగటమా, మంచి ఆరోగ్యమా? ఎన్నిక మీదే

జారీచేసినవారు : ది సెంట్రల్ హెల్త్ ఎడ్యుకేషన్ బ్యూరో
డైరక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, న్యూఢిల్లీ.
davp '80




# పొగుడు మాటలు

— వింధ్యవాసిని

సాయంకాలం అయిదున్నరయింది. ఆఫీసు నుంచి రెండు బస్సులు మారి ఇల్లుచేరిన కృష్ణ ఉసూరని నిట్టూర్చేడు. నిర్మల లేదింట్లో. వంటామె యిచ్చిన కాఫీ తాగి బట్టలయినా మార్చుకోకుండా అలానే కూర్చుని, ఆవేళటి న్యూస్‌పేపర్ పుచ్చుకుని చదవసాగేడు.

కళ్ళు పేపర్లో అక్షరాల వెంట పరుగులు తీస్తున్నా, మనసు మాత్రం మరేదో ఆలోచిస్తోంది. హఠాత్తుగా ఎందుకో, "అమ్మగారెన్ని గంటలకి వెళ్ళారు?" అని వనామెని అడిగాడు.

"భోంచేసి రెండు గంటలకి వెళ్ళారండి" అందామె.

అడిగిన తర్వాత అన్పించింది కృష్ణకి ఎంత పనికిరాని ప్రశ్న వేశానా? అని. ఎన్ని గంటలకి వెళితేనేం? తాను వచ్చేసరికి ఆమె లేదు. ఎన్ని గంటలకి వస్తుందనే విషయం ఎవరూ చెప్పలేరు. ఇంకా ఆమె ఏం డ్రస్సు వేసుకుని వెళ్ళిందని అడిగితే బావుండు అనిపించింది.

కానీ అలాంటి ప్రశ్న అడగలేదు తను. మోడెస్టీ అడ్డం వస్తుంది.

నిర్మల కొక లైట్‌బ్లూ, ప్లెయిన్ అమెరికన్ జార్జెట్ శారీ వుంది. దానికి మాచింగ్‌గా బ్లూ స్లీవ్‌లెస్ చికిన్ వాయిల్ బ్లవుజ్ వేస్తుంది. ఆ డ్రస్సు వేసుకుని అమె బయటికి వెళ్ళటం కృష్ణ కిష్టం వుండదు. ఆ డ్రస్సులో ఎంత అందంగా వుంటుందో, తెల్లని గుండ్రటి భుజాలు, శారీ లోపల్నించి బయటికన్పించే జాకెట్ కింది భాగం ఎంత ప్రొవోకింగ్‌గా వుంటాయో ఇతనికి అనుభవ పూర్వకంగా తెలుసు. పెళ్ళికి ముందు ప్రేమించుకునే రోజుల్లో, ఎంతగానో కోరి ఆమెనా డ్రస్ వేసుకు రమ్మనేవాడు. మరి అదే ఇప్పుడు కంటకమయింది. ఆమె ఒంటరిగా బయటి కెళ్ళినప్పుడా చీర కట్టుకోకపోతేనేం అనుకుంటాడు. కానీ నోరు విడిచి చెప్పలేడు పాపం. చెప్పినా వింటుందనే నమ్మకమూ లేదు. పైపెచ్చు ఎగతాళి చేసినా చెయ్యొచ్చు.

కృష్ణ ఇలా పేపర్ చదువుతూ మధ్య మధ్య ఆలోచనల్ని నంజుకుంట్లో వుండగానే, హైహీల్డు చెప్పులు టకటకలాడించుకుంటూ వచ్చింది నిర్మల. తాను అదే పనిగా ఆమె కోసం కాచుక్కూచున్నట్లు కన్పించటం ఇష్టం లేదు. అందుకని, "మిస్టర్ జగజీవన్‌రామ్, లీడర్ ఆఫ్ ది అపోజీషన్, టు నైట్ కారక్టరైజ్డ్ ది ప్రెసెంట్ గవర్నమెంట్ లెడ్ బై మిస్టర్ చరణ్‌సింగ్ ఏస్ ఎ మైనారిటీ కేర్‌టేకర్ గవర్నమెంట్, వుచ్ హేడ్ నో రైట్ టు టేక్ ఎనీ పాలిసీ డెసిషన్స్" అని తనలో తను చదువుతున్నట్లు పైకే చదివాడు.

చెప్పులొక మూలకి విసిరేసి కృష్ణకెదురుగా మరో కుర్చీలో కూలబడి, "అవ్వా టీ తీసుకురా" అని ఓ కేకేసింది వనామెని.

"అబ్బ. ఇవాళ భలే బోర్ కొట్టేసిందనుకో కృష్ణా. మూడు గంటలకల్లా రిహార్సల్స్‌కి రెడీగా వుండమంటాడు ఆ హేమంత్. ఒకరొస్తే ఒకర్రారు. బొత్తిగా డిసిప్లిన్ లేదు. అందుకే ప్రతీసారీ అనుకుంటాను ఈ ఎబిఆర్ డ్రామాల జోలికి వెళ్ళనే కూడదని" అని

మాట్లాడుతున్నదల్లా వంటావిడ తెచ్చిన టీ అందుకుని, ఇంకా అలాగే పేపర్ పట్టుకుని వున్న కృష్ణని చూసి, "అసలు నేనొచ్చానని, ఏదో వాగుతున్నానని గమనించావా?" అంది నవ్వుతూ.

"ఎందుకు తెలీదు? వింటూనే వున్నాను గదా?" అని పేపర్ పక్కకి తీసి తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు, ఆమె కట్టుకున్న గ్రీన్ ప్రింటెడ్ సింథటిక్ చూసి.

నిర్మలకి చదువుకుంటున్న రోజుల్నించీ డ్రామాలు రాయటం డైరెక్టు చేయటం, నటించటం అలవాటు అయింది. పెళ్ళయాక స్టేజి నాటకాలు మానేసి, రేడియో డ్రామాలకే పరిమితం చేసుకుంది తన టాలెంటుని. ఆమెకే హాబీ వున్నా కృష్ణకి అబ్జక్షన్ లేదు. కానీ ఆదే పిచ్చిగా పరిణమించటం మాత్రమిష్టం లేదు. అందుకే పట్టనట్లుగా వుంటాడు.

ర ర ర

ఉదయం ఎనిమిదిన్నరయింది. అద్దం ముందు నిల్చుని తల దువ్వుకుంటూ, మీసాలు ట్రిమ్మింగ్ బాగా కుదిరిందా లేదాని చూసుకుంటున్నాడు కృష్ణ. అప్పుడే స్నానం చేసి వచ్చి దువ్వెన తీసుకుని కూచుంది నిర్మల.

ఇటు తిరిగి, "సైనాట్ కరెక్టుగా కుదిరిందో లేదో చూడవోయ్ కాస్త" అన్నాడు. నిర్మల దగ్గరకొచ్చి కొద్దిగా సరిచేసి, అతని రెండు భుజాలమీద చేతులేసి చిలిపిగా కళ్ళలోకి చూసింది.

"ఇవాళేమిటి ప్రోగ్రాం, రిహార్సల్స్ లేదనుకుంటా." అన్నాడు.

"ఉహుఁ! లేదుగానీ సమతా పబ్లిషర్ మేనేజర్ని చూడటానికి వెళ్ళాలి. అతన్నన్నివరకట్న నిషేధం మీదొక డ్రామా రాసివ్వమని ఎన్నాళ్ళబట్టో అడుగుతున్నాడు కద. అయిపోవచ్చింది రాయటం. వెళ్ళి మాట్లాడదామని."

ఆ మేనేజరంటే కృష్ణకి పడదు. అతనెప్పుడయినా పనిమీద తమ ఆఫీసు కొస్తుంటాడు. అతనికి గౌరవమివ్వటమంటే ఏమిటో తెలియదు. తానేదో అందరికన్నా పైమెట్టులో వున్నట్టు, మిగతా వాళ్ళంతా తన సబార్డినేట్సు అయినట్లు ప్రవర్తిస్తాడు.

"పర్సనల్‌గా వెళ్ళకపోతేనేం? ఓ కార్డు రాసి పారేస్తే సరి. ఎవర్నయినా పంపిస్తాడు" అన్నాడు.

"ఇలాంటివి లెటర్స్‌తో జరుగుతాయా కృష్ణా! ఒక వెయ్యిన్నరదాకా రెమ్యూనరేషన్ వుండే డీల్ యిది. జాగ్రత్తగా చేయాలి. అవతలి మనిషెంత పిసినారివాడో తెలిసుండీ మధ్యవర్తుల ద్వారా మాటలు జరపమంటావేం?" అన్నది ఆశ్చర్యంగా.

"అబ్బ. నీకెప్పుడూ డబ్బు గొడవేనా? నా ఫీలింగ్ అసలు అర్థం చేసుకోవేం? ఆ మనిషితో నీవెళ్ళి మాట్లాడటం నాకిష్టం లేదు" అనాలన్పించింది. కానీ అనలేకపోయాడు.

"అయితే సాయంకాలం నేరుగా టాంక్ బండ్ దగ్గరి కొచ్చేస్తావా! అలా తాసేపు గడిపి మంచి హోటల్లో భోంచేసి వద్దాం" అన్నాడు హుషారు తెచ్చుకుంటూ.

"ఓ....సారీ కృష్ణా! మా ఫ్రెండు సునీత ఇంటికొస్తానని మొన్ననే ఓ కార్డు రాసేశాను. తను తన ప్రోగ్రామ్స్ అన్నీ మానుకొని నా కోసం ఎదురు చూస్తూ వుంటుంది. పోనీ, రేపు తప్పక వస్తాను. సరా?" అంది ఓదారుస్తున్నట్లుగా.

నీరసం వచ్చేసింది కృష్ణకి. ఎలాగో షూష్ వేసుకోవటం ముగించి, బ్రీఫ్‌కేసు పుచ్చుకుని బయలుదేరాడు.

నడుస్తోంటే, బస్ ఎక్కి ప్రయాణిస్తోంటే ఆలోచనలు గతంలోకి వెళుతున్నాయి తనకి తెలీకుండానే. ఎప్పుడూ యింతే నిర్మల. తన ఇష్టానుసారంగా కార్యక్రమాల్ని నిర్ణయించుకొంటుంది. తన కోసం ఎప్పుడూ ఆమె ప్రోగ్రామ్స్ మార్చుకోదు. అయితే చేసే పనులకి కారణాలు మాత్రం బాగా సృష్టించగలదు. కృష్ణకి అనిపిస్తుంది, ఆమెకి తనతో రావటం ఒకోరోజు యిష్టంలేకనే అలా సాకులు చెప్పి సమర్థించుకుంటుందేమో అని. అప్పుడూ, ఎప్పుడూ ఆమె ప్రవర్తన ఇంతే. కానీ,




అప్పుడు పెళ్ళికి ముందు, తామిద్దరూ ప్రేమించుకుంటున్న రోజుల్లో తన కోసం, వాళ్ళ నాన్నకి సాకులు చెప్పేది. అప్పుడదంతా తనమీద ప్రేమకి నిదర్శనంగా సంతోషాన్ని కలిగించేది.

అప్పట్లో ఒక రోజు జరిగిన సంఘటన గుర్తొచ్చింది. సాయంకాలం కాలేజీనించి నేరుగా వచ్చి, పబ్లిక్ గార్డెన్స్‌లో తామెప్పుడూ కూర్చునేచోట తనని కలుసుకుంది. అంతవరకూ రెస్టులెస్‌గా కాచుకుని వున్న తనకామె అల్లంత దూరంలో కన్పించేగానే, ఎంతో సంతోషముయింది. ఆ సంతోషంలో దగరికి రాగానే గట్టిగా వాటేసుకుందామనుకున్నాడు. కానీ అతని వుద్దేశం నిర్మలకేం తెలుసు? గబగబా నడవటం అందులో హైహీల్సుతో, ఒకవైపు చీరకుచ్చిళ్లు ఎత్తిపట్టుకుని వచ్చి ఆయాసంగా కూచుంటూ "నిన్నేమయిందో తెలుసా కృష్ణా?" అని మొదలుపెట్టింది తన ధోరణిలో.

అయినట్లే ఇక; తను చెప్పాలిసిందంతా చెప్పేదాకా ఏం చేయనీయదు, మాట్లాడనీయదు అనుకున్నాడు కృష్ణ.

నిర్మల ఏదయినా చెప్పాలని అనుకుంటే అవతలి మనిషి రెస్పాన్స్ లేకున్నాసరే పట్టించుకోవటం వుండదు.

"నిన్న మా డాడీ వూళ్లో లేరని ధైర్యంగా నీతో సినిమా కొచ్చేనా? ఇల్లు చేరేసరికి తొమ్మి

దిన్నరయింది. హాయిగా "ఆకాశం నీ హద్దురా అవకాశం వదలొద్దురా" అని హమ్ చేసుకుంటూ ఇంట్లో అడుగు పెట్టేను. ఆఫీసు రూమ్‌లో లైటు కనిపించేసరికి గుండె గుభేలు మంది.

"నిమ్మీ ఏమ్మా ఇంతాలస్యం అయింది?" లోపల్నించి విన్పించింది నాన్నగారి స్వరం గంభీరంగా. మా డాడీకి నేనంటే ఎంత ముద్దు అయినా, డిసిప్లిన్ తప్పితే వూరుకోరని తెలుసుగా?"

గబ గబా చెబుతోంది. "ఫరవాలేదు. కాస్త నిదానంగా చెప్పు. తొందరేం లేదు" అన్నాడు కృష్ణ హాస్యంగా.

నిర్మల ఆ హాస్యాన్ని కూడా గమనించే స్థితిలో లేదు.

"అప్పుడొక్క క్షణంలో నాకెలా స్ట్రయిక్ అయిందో ఏమో. మెల్లిగా వెళ్ళి డాడీ కుర్చీ చేతిపై కూచుని "మరేమో డాడీ - మా బోటనీ మాడమ్‌కి నేనంటే చాలా ఇష్టమని చెప్పలేదూ? ఆవిడే సాయంకాలం ఇంటికి బయలుదేరి వెళ్ళేటప్పుడు, 'నిర్మలా! ఇవాళ మా యింటికి రారాదూ? అని ఆహ్వానించింది. ఆమె అలా ఎవర్నీ అడగదు. నన్నయినా యిదే మొదలు. మారు మాట్లాడకుండా వెంట నడిచాను.

"సబ్జక్ట్ గురించి ఏదో మాటాడుకుంటూ రిక్షాలో ఆవిడ ఇంటికి వెళ్ళాము. ఆవిడ నా కోసమని కాఫీ, టిఫిన్ చేసి పెట్టేరు. ఇంతలో ఆమె కొడుకు నాలుగేళ్ళవాడు ఆటల్లో కింద పడి నుదుటికి దెబ్బ తగిలించుకుని వొచ్చాడు. ఏకధారగా రక్తం కారిపోతోంది. ఆ రక్తం చూడగానే మేడమ్‌కి కళ్లు తిరిగినట్లయి మాట్లాడలేకపోతున్నారు. సమయానికి ఆవిడ భర్త ఇంట్లో లేరు. నేనే గబ గబా ఓ కర్చీఫ్ గట్టిగా కట్టి ఆమెని తొందరపెట్టి హాస్పిటల్‌కి బయలు దేరదీశాను. ఆటో తీసుకుని, హాస్పిటల్‌కి వెళ్ళి చూపితే, బాగా చీలింది కుట్లు వేయాలన్నారు. అవన్నీ అయి, డ్రస్సింగ్ చేయించుకుని ఇంటికొచ్చేసరికి ఎనిమిదిన్నరయిపోయింది.

"అప్పుడు టయిం చూసుకుని నేను గాభరాగా ఇంటికి వెళ్ళాలన్నాను మేడమ్‌తో. అప్పటికామె భర్త సుబ్బారావుగారు వచ్చున్నారు. జరిగిందంతా తెలిసి నాకెంతగానో కృతజ్ఞతలు చెప్పారు—టయానికి మేడమ్‌కి సహాయం చేశానని. అయినా నేను స్పెషల్‌గా చేసిందేముంది డాడీ? ఆ సిచ్యువేషన్‌లో ఎవరున్నా అంతమాత్రం చేయగలిగేవాళ్ళు కదూ? ఎంత చెప్పినా వినకుండా, భోజనం చేయాలని ప్రెస్ చేశారు. అయినాక ఇద్దరూ కలిసి టాక్సీ తీసుకొచ్చి ఆ వీధి చివర్లో దిగబెట్టి వెళ్ళారు" అని ముగించాను.

"నమ్మినట్లే కన్పించారు డాడీ. "అక్కణ్నించి అలాగే పంపేశావా? ఇంటికి రమ్మన లేదూ?" అనడిగారు.

"మీ రింట్లో వుంటారని నాకేం తెలుసు? ఇంకోసారెప్పుడయినా మీకు చెప్పి ఆహ్వానిద్దాంలే అని వూరికే వుండిపోయాను" అన్నాను.

ఆమె సమయస్ఫూర్తికి పొంగిపోయాడు కృష్ణ అప్పుడు. ఆ తెలివే నా ప్రాణం తీస్తుంది అనుకుంటున్నా డిప్పుడు.

* * *


తెల్లారి ఆరున్నరయింది. కృష్ణ నిద్ర పోతున్నాడు. నిర్మల లేచి ఆవలిస్తూ వచ్చి పేపర్ పుచ్చుకుంది.

"అమ్మా, పాలకి డబ్బులు" అంది అవ్వ.

ఒక బాటిల్ పాలకి ఒక్క రూపాయి ఐదు పైస లివ్వాలి. తన బేగ్‌లో రూపాయిలున్నాయి కానీ చిల్లరలేదు. అయిదు పైసల కోసం కృష్ణ పేంటు జేబులో చూస్తే రెండు చిన్న కాగితం ముక్కలుకూడా తగిలాయి. ముందుగా అవ్వకి డబ్బిచ్చి పంపేసి, పేపర్ ముక్కల్ని పరీక్షించింది. రెండు రెక్స్‌థియేటర్ సినిమా టికెట్ ముక్కలు. ఏదో మోసం జరిగిపోయినట్లుగా కుంచించుకుపోయింది నిర్మల ముఖం. క్రితం రాత్రి లలితకళామందిర్‌లో ఏదో సాహిత్యసభకి వెళ్తానని చెప్పినట్లు గుర్తు. ఆవేళ తనకేం ప్రోగ్రాం లేదు. ఇద్దరం కలిసి ఎటయినా వెళదామన్నది.

"సారీ నిమ్మా. మా ఫ్రెండొకడు పాస్






పట్టుకొచ్చిచ్చాడు. మాంచి సాహిత్య సభ. మిస్ కావడమెందుకని వెళదామనుకున్నాను. ఏమనుకోకు" అని బుగ్గమీద చిటికేసి వెళ్ళిపోయాడు. సాహిత్యసభలంటే తనకూ ఇష్టమే. వీలుంటే తనూ వెళుతోంటుంది. దానికయితే వద్దననే అలా చెప్పాడు కృష్ణ.

ఉహుం ఇలా ట్రిక్ వేశాడన్నమాట-అనుకుని పెదవి కొరుక్కుంటూ, ముఖమయినా కడుక్కోకుండా అలానే కూలబడిపోయింది.

ఈయనెప్పుడూ ఇంతే. దేనికయినా సాకులు ఎక్స్‌క్యూజెస్ వెతికి, మోసం చేయటం బాగా అలవాటు. ఒకప్పుడు పెళ్ళికి ముందు, తన కోసం వేరేవాళ్ళని బుట్టలోపడేసి వొచ్చేవాడు-ఇలా అనుకుంటే ఆమె మనసు గతంలోకి వెళ్ళిపోయింది.

ఒకరోజు నిర్మల కాలేజీకి వెళ్ళగానే తెలిసింది, ఎవరో బిషప్ చనిపోయారని, సెలవిచ్చారనీను. వాళ్ళది మిషనరీ కాలేజి.

ఇంటికి వెళితే ఏం తోచదు. ఇప్పుడు కృష్ణని కలవగలిగితే హాయిగా సాయంకాలం దాకా ఏ గండిపేటకో చెక్కెయ్యొచ్చు. వెంటనే ఎదురుగా కన్పించిన టెలిఫోన్ బూత్‌లో దూరి కృష్ణ ఆఫీస్‌కి ఫోన్ చేసింది.

"కృష్ణా నువ్వు వెంటనే సెలవుపెట్టి వచ్చేసెయ్. అర్జెంట్" అంది సస్పెన్స్ క్రియేట్ చేస్తూ.

"ఏమిటీ! అసలేమయిందో సరిగ్గా చెప్పవోయ్" అన్నాడతను ఆదుర్దాగా.

"అయ్యో మాస్టారూ? ఎందుకంత భయం. మాకు సెలవిచ్చేశారు. నువ్వు సెలవు పెట్టి వచ్చేస్తే....జామ్మని గండిపేట...."

నిర్మల మాటలు ముగించనేలేదు. "ఆం చాల్చాలు. ఇంకేం చెప్పద్దు. పెట్టెయ్యి ఫోను. ఒక్క నిముషం కూడా వేస్టు చెయ్యకుండా వచ్చేస్తాను" అని పెట్టేసాడు. ఆ మాటల్లో తొంగి చూస్తున్న ప్రేమకి పొంగిపోయింది నిర్మల.

ఇరవయి నిముషాల్లో స్కూటర్‌తో ప్రత్యక్షమయాడు కృష్ణ. గండిపేట అని చెప్పి వుండటంవల్ల ఎవరో ఫ్రెండ్ స్కూటర్ తీసుకొచ్చాడు కాబోలు అనుకుంది నిర్మల. "కూచో మరి. నేరుగా వెళదాం" అని స్టార్ట్ చేశాడు. దారిలో కొన్ని స్నాక్స్, పళ్ళు పాక్ చేసుకుని అరగంటలో గండిపేట చేరారు.

చెరువు ఒడ్డున సావధానంగా కూచుని, కృష్ణ తలని తన ఒళ్ళో పెట్టుకుని వున్నపుడు అడిగింది నిర్మల "అయితే నా కోసం సెలవు పెట్టి వచ్చేశావు కదూ?" అంది.

"ఊహూ! సెలవు పెట్టలేదు. పర్మిషన్ పెట్టి వచ్చేశాను డియర్, ఆన్ డ్యూటీ నేను" అన్నాడు తేలిగ్గా నవ్వుతూ.

"ఆన్ డ్యూటీనా! ఏమని చెప్పావసలు?" అంది ఆశ్చర్యంగా.

"ఏవో ఒకటిలెస్తూ. ఇప్పుడెందుకవన్నీ" దాటెయ్యబోయాడు.

"ఊఁ అలాకాదు. చెప్పు కృష్ణా!" గోముగా అడిగింది.

"మా ఆఫీసర్ హయవదన్రావుగారికి సన్యాసులు, సాధువుల పిచ్చివుంది. ఊరిలోకి కొంచెం పేరున్న ఏ స్వామి వచ్చినా, వీలు చూసుకుని తమ ఇంటికి ఆహ్వానిస్తుంటారు. అలా ఎంత మందికి ఆతిథ్యమిస్తే అంత పుణ్యం వస్తుందని వారి అభిప్రాయం.

"నువు ఫోన్లో పిలవగానే నాకో అయిడియా తట్టింది. అంతే యేదో ఒక ఫైలు పట్టుకుని వంతకాలకోసం ఆఫీసర్ గదిలో దూరేను. ఇవాళ సాయంత్రమాయన ఒక ముఖ్యమయిన మీటింగ్ ఎటెండ్ అవాలసి వుంది. అందుకని పనిలో బిజీగా వున్నారు. అయినా ఛాన్సు తీసుకుని చెప్పాను.

"సర్. శంకరమఠానికి స్వామి రామానంద అని బెంగాల్ నుండి ఒక స్వామివారు వేంచేశారట. నా మిత్రుడొకడు వారి ముఖ్య భక్తుడు. మీకు తెలుసా సార్ వారు?"అన్నాను. వెంటనే రియాక్షన్ కన్పించింది. 'అలాగటోయ్ కృష్ణా. మరి మన యింటికి ఆహ్వానిస్తే బావుంటుందే. ఏమంటావ్?' అన్నారు. 'బావుంటుంది సర్. కానీ వారికింకా చాలా వూళ్ళకి వెళ్ళే ప్రోగ్రామ్స్ వున్నాయట. ఓ రెండ్రోజులిక్కడ వుంటారేమో అంతేనని చెప్పాడు నా స్నేహితుడు'' అన్నాను జాగ్రత్తగా.

"దానేముంది. మనం ఇవాళే వెళ్ళి, మనింటికి రేపు వచ్చేలా ఆహ్వానిద్దాం. సరిపోదూ! కానీ నా కివాళ ఎటు వెళ్ళేందుకూ అసలు తీరికే లేదే. ఏమిటి చేయడం? పోనీ సాయంకాలం నువ్వెళ్ళి నా తరఫున మాట్లాడరాదూ?" అన్నారు.

"ప్లానేం పారేలాలేదు అనుకుని ఆఖరి ప్రయత్నంగా, 'మరి నా స్నేహితుడి సహాయం కావాలంటే ఇప్పుడే వెళ్ళాలి. వాడు ఆఫీసుకి సెలవేసి ఉదయం నుండీ సాయంకాలందాకా అక్కడే గడుపుతున్నాడు. ఇప్పుడు పోవటానికి కూడ నా పని—''' అని నసిగాను.

"'అఁ పనికేముంది, రేపు చూసుకోవచ్చు. అర్జెంట్ ఏదయినా వుంటే సురేష్కో, చంద్రశేఖరానికో చెబుతాను చూడమని. వెళ్ళు వెళ్ళు. నువ్వెళ్ళిరా....ఒట్టిగా ఆహ్వానించటం కాదు. వారేం తింటారో, వారి అలవాట్లేమిటో అన్నీ వివరంగా కనుక్కుని రావాలి. ఏం?' అని తన వర్క్లోకి పడబోతూ, తిరిగి అన్నారాయనే, 'అన్నట్లు కావాలంటే స్కూటర్ తీసికెళ్ళు. ఎంతసేపయినా ఫరవాలేదు. ఇప్పుడప్పుడే నాకేం అవసరం లేదులే' అని తాళాలు అందించారు.

"నాకు ఏనుగెక్కినంత సంతోషమయింది. ఆఘమేఘాల మీద వొచ్చాను" అని ముగించాడు కృష్ణ.

"మరి ఆ స్వామిని ఆహ్వానించటం...."

"అరే పిచ్చి నిమ్మూ! ఇంత ఆలోచన్లేకుండానే ఇంత ప్లాన్ వేస్తానని ఎలా అనుకున్నావ్? ఆ స్వామి వారి శిష్యుడెవరో కాదు, నా క్లోజ్ ఫ్రెండ్ రాజబాబు లేడూ, వాడే. వచ్చే ముందు వాడికి ఫోన్ చేసి అంతా వివరంగా చెప్పివచ్చాను. చెయ్యాల్సిందంతా ఇప్పటికి చేసేవుంటాడు. నేను వెళ్ళే పనేలేదు" అని నవ్వేశాడు.

ఆరాధనగా చూసింది నిర్మల కృష్ణవయిపు.

ఆ సంఘటన తల్చుకుని, 'హు' అని నిట్టూర్చి, బాత్రూంకి వెళ్ళింది.

* * *

ఆవాళ "కోరికలే గుర్రాలయితే!" సినీమాకి వెళ్ళాలని రెడీ అవుతున్నారు, నిర్మల, కృష్ణ. కృష్ణ డ్రెస్ చేసుకుని కూచుని ఏదో పత్రిక చదువుతున్నాడు, నిర్మల రెడీ అయే లోపల ఓ కథ చదివేయొచ్చని.

అద్దం ముందు కూచుని, ముడి, దానిలో రోజా పువ్వు చక్కగా కుదిరాయా లేదా అని తల అటూ యిటూ తిప్పి చూసుకుంటోంది నిర్మల.

"కృష్ణా నే నొక మాటడుగుతాను. సరే అంటావా?" ఇటు తిరగకుండానే, ముఖానికి పవుడర్ రాసుకుంటూ అంది.

పలకలేదు కృష్ణ.

"అసలు వినిపిస్తోందా?" కాస్త గట్టిగా అంది.

"ఏమిటోయ్. కథ మంచి ఇంటరెస్టుగా వుంటేనూ....యేవిఁటి చెబుతున్నావ్? ఇంకోసారి చెప్పు, వినేస్తాను త్వరగా."

"ఇంకా ఏమీ చెప్పందే...."

"సరే, మరి మొదలుపెట్టేసేయి...."

మళ్ళీ పత్రికలో ఎక్కడ తల దూర్చేస్తాడో నన్న భయంతో చెప్పేసింది.

"మరే. మనం ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాంగా బెంగుళూరు, మైసూరు వెళ్ళిరావాలని. ఈ వీక్లో రెండో శనివారం, ఆదివారం కలిసొస్తాయి. మరో రెండ్రోజులు సెలవ్ పెట్టేస్తే వెళ్ళిరావొచ్చు. వూఁ అను, కృష్ణా. ఈసారి దాటెయ్యకు."

"ఈ నెల్లో కొంచెం ఖర్చులెక్కువయ్యాయని నీకూ తెలుసుగా....మరి డబ్బులు...."

"ఆపాపు. నువ్వలా అనేసి తప్పించుకుంటావని తెలుసు. రేపు సమతా పబ్లిషర్స్ మేనేజర్ అయిదొందలకి చెక్ ఇస్తాడు అడ్వాన్సుగా, సో, ఆ ప్రాబ్లమ్ కూడా లేదు. సరేనా?"

"సరే. బాగానే వుందిగానీ, మరీ ఆఫీసులో కొత్త సూపర్నెంట్ వచ్చి పదిరోజులు కూడా అవలేదు. ఇన్నాళ్ళూ కష్టపడి పెంచుకున్న ఇంప్రెషన్ కాస్తా ఇప్పుడు సెలవు తీసుకుంటే ఏమయిపోతుంది? ఇంకొక్క నెల రోజులాగేవంటే తప్పక వెళదాం."

ఈ సారి వూరుకోలేదు నిర్మల. కృష్ణ దగ్గిరకొచ్చి, కుర్చీచేతులమీద, రెండు చేతులేసి అతని కళ్ళలోకి యేదోలాగ చూసింది. అప్పుడు గమనించాడు కృష్ణ. తన కిష్టమయిన లైట్ బ్లూ అమెరికన్ జార్జెట్ చీర కట్టుకుంది. తెల్లటి నుదుటిమీద ఎర్రటి బొట్టు, అచ్చంగా అదే కలర్లో లైట్గా వేసుకున్న లిప్స్టిక్, తలలో తొంగి చూస్తున్న ఎర్రగులాబీ పూవు-మ తెక్కిస్తోంది ఆమె రూపం. గభాలున ఒళ్ళోకి లాక్కున్నాడు.

"కృష్ణా! బంగారువి కదూ? సెలవు పెట్టెయ్యవూ? ఏ ఆఫీసర్ అవుతే నీకేం భయం? నిన్నేం చేయగలరు? నీ సిన్సియారిటీ అందరికీ తెలిసిందే. రేపో మాపో నువ్వే ఆఫీసర్ అవుతావు. అందుకని యేదో ఒక సాకుతో సెలవు పెట్టెయ్. 'మదరిన్లా సీరియస్' అని టెలిగ్రాం వొచ్చిందని చెప్పేస్తే సరి. ఎలాగూ మా అమ్మ లేదు గద...."

అతను వీపుమీద చేతులేసి లాక్కుంటోంటే ఊపిరి తిప్పుకుని మెల్లిగా అంది. "అయినా యేదయినా చేయాలనుకున్నావంటే దానిక్కారణాలు వెతికి చెప్పటం నీకు వెన్నెతో పెట్టిన విద్య కదూ?" అనేసింది, అనకూడదనుకుంటూనే.

నిజానికి మామూలుగా అవుతే, "నువ్వేం తక్కువదానివా?" అనేసి వుండేవాడు కృష్ణ.

చిన్నప్పు డాడుకునే దాగుడుమూతలు, పెద్దాళ్ళయ్యాక, పెళ్ళయాక కూడా ఆడుకుంటే? □

